క్లుప్తంగా

వర్షాలు కురవాలని పూజలు



పూజలో పాల్గొన్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కైలాసనగర్ కాలనీలో పోచమ్మ ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి స్థానిక మహిళలు, యువతులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

'పాలకుల వైఫల్యంతోనే రైలు ప్రమాదం'



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: పాలకుల వైఫల్యంతోనే రైలు ప్రమాదం చోటు చేసుకుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్‌సింగ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఒడిశాలో మూడు రైళ్లు ఢీకొని 300 పైగా మంది మృతి చెందారని, దీనికి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా, రైల్వే శాఖలో ఉద్యోగం కల్పించాలని, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని, రూ.10 లక్షలు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు.

అన్నదానం కోసం రూ.లక్ష విరాళం



దుర్గం శేఖర్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

ఎదులాపురం: తన జన్మదిన వేడుకలను పురస్కరించుకుని దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ అంబేద్కర్ సభకు అన్నదానం కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా దుర్గం శేఖర్‌కు కేక్ తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో శేఖర్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం దుర్గం శేఖర్ తన మాతృమూర్తి దుర్గం చిన్నుబాయి జ్ఞాపకార్థం ట్రస్ట్ తరపున ఈనెల 6న జిల్లా కేంద్రంలో జరగనున్న ప్రకాశ్ అంబేద్కర్ బహిరంగ సభ అన్నదానానికి రూ.లక్ష విరాళం అందించారు.

గాలివాన బీభత్సం



కరంజి సమీపంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. కరంజి నుంచి గుడికి గ్రామానికి వెళ్లే రోడ్డుపై చెట్టు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల చొరవచూపి చెట్టును తొలగించారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం గంటపాటు వర్షం కురిసింది. వాతావరణం ఒ క్కసారిగా చల్లబడింది. నెలరోజులుగాఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనం కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడం గర్వకారణమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో బాక్సింగ్‌లో జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన నితిన్‌కుమార్(స్వర్ణ), ఎండీ మాలిక్ (కాంస్య) పతకాలను సాధించారు. ఈ మేరకు వారిని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం సన్మానించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. కోచ్ ఆనంద్ భాస్కర్‌ను సైతం అభినందించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ కబీర్ దాస్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్లు

- గతనెల రెండోవారం నుంచి పనులు
- రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల వ్యయం



బేల ఇందిరానగర్ కాలనీలో ఇటీవల చేపట్టిన సీసీ రోడ్డు

బేల: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల పనులు సాగుతున్నాయి. గతనెల రెండో వారం నుంచి ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలం మొత్తంగా రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న నిర్మాణ పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. అన్నిచోట్ల మరో 10 నుంచి 15 రోజుల వరకు పూర్తికానున్నాయి. ఇదిలా ఉండగా 2022–23 సంవత్సరానికి మంజూరైన ఈ రోడ్లకు గత మార్చిలో ఆన్‌లైన్ బ్రేక్ పడింది. గత మార్చి నెల 27న సీఆర్‌డీ(కమీషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) సర్వర్ లాక్ కావడంతో సీసీ రోడ్ల పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. మంజూరైన పనుల్లో సగం వరకు మాత్రమే పూర్తయ్యాయి. సర్వర్ లాక్‌తో ఇప్పటికే చేసిన పనులు, ఇక ముందు చేపట్టే పనుల వివరాలు నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేకుండా పోయింది. బిల్లులు వస్తాయో లేదోనని అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో ఆ తర్వాత ఈ నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకు సాగలేదు.

మంజూరైన రూ.4కోట్ల పనులు ఇలా..

పంచాయతీరాజ్ అధికారుల ప్రతిపాదనలతో 2022–23 సంవత్సరానికి మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, పలుచోట్ల మురుగుకాల్వల నిర్మాణాల కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు రూ.4 కోట్లు మంజూరైనవి. అత్యధికంగా బేల, దహెగాం పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున మంజూరయ్యాయి. రూ.35 లక్షలు పోనాల, మణియార్‌పూర్‌కు రూ.30 లక్షలు, బెదోడ, సిర్సన్న, పాటన్‌కు రూ.20 లక్షలు, గూడ, బాది, సదల్‌పూర్‌కు రూ.15లక్షల చొప్పున మంజూరయ్యాయి. మిగతా గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పనులు మంజూరయ్యాయి.

ఏప్రిల్ మూడో వారంలో సర్వర్ ఆన్‌లైన్ క్లియర్..

మంజూరైన ఈ నిర్మాణ పనులకు బేల ఎంపీడీవో కార్యాలయంలోని ఈజీఎస్ కంప్యూటర్ కేంద్రంలో మాస్టర్ జనరేట్‌లు గతమార్చి 27 లోపే పూర్తయ్యాయి. ఆ పనులన్నీ ఆన్‌లైన్ ఇన్‌ప్రొగ్రెస్ అయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని ఈ పనుల వర్క్ ఐడీను భువన్ యాప్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో ఎంట్రీ చేసి, పని ప్రదేశం ఫొటో క్యాప్చర్ పూర్తి చేశారు. దీంతోపాటు ఈ పనులకు ఒక కూలీ పేరుతో పని డిమాండ్ నమోదు చేసి, మాస్టర్లను జనరేట్ పూర్తి చేయించారు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్‌లో పంచాయతీరాజ్ శాఖకు నివేదించారు. గత మార్చి రెండో వారం నుంచి సీసీ రోడ్లు, మురుగుకాల్వల పనులు చేపట్టిన క్రమంలో 27న ఆకస్మాత్తుగా కేంద్ర ప్రభుత్వం పరిధిలోని సీఆర్‌డీ సాఫ్ట్‌వేర్ సర్వర్ ఆన్‌లైన్ లాక్ అయింది. దీంతో వెంటనే ఆ నిర్మాణ పనులన్నీ పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. మళ్లీ ఆ సర్వర్ ఏప్రిల్ మూడో వారంలో ఆన్‌లైన్ క్లియర్ అయింది. కాని బిల్లులు కోసం ఏదైనా సమస్య తలెత్తుందోనని కాంట్రాక్టర్లు, సర్పంచులు ఏమాత్రం పనులు చేపట్టలేదు. పంచాయతీ అధికారులు స్పష్టత ఇవ్వడంతో ఆలస్యంగా పనులు కొనసాగుతున్నాయి.

త్వరలోనే పనులు పూర్తి



సీసీ రోడ్లు, మురుగుకాల్వల పనులు గత మార్చిలో సీఆర్‌డీ సర్వర్ లాక్‌తో నిలిచిపోయాయి. మళ్లీ ఆన్‌లైన్ ఏప్రిల్‌లో మూడో వారంలో క్లియర్ అయిన క్రమంలో ఆ పనులన్నీ పునఃప్రారంభమయ్యాయి. మరో 10 రోజుల్లో ఈ పనులన్నీ పూర్తికానున్నాయి.

– మహేందర్‌కుమార్, ఎంపీడీవో బేల

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

ఆదిలాబాద్: అర్చకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దూపదీప నైవేద్యం పథకం కింద గౌరవ వేతనాన్ని సీఎం కేసీఆర్ పెంచడం హర్షనీయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కలవరపు లింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు పనకంటి విలాస్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీపాద విజయ్‌కుమార్ చారి, గౌరవ సలహాదారులు తిరునగరి స్వస్తిక్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



బయల్దేరుతున్న మావల మండల నాయకులు

కైలాస్‌నగర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మాడల్‌గా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం నిర్మల్‌లో సీఎం కేసీఆర్ సభకు జిల్లా కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ నేతలు, అభిమానులు బయలుదేరగా మున్సిపల్ చైర్మన్ బస్సులను ప్రారంభించారు. 1500ల మంది నేతలు, అభిమానులు వెళ్తున్నారన్నారు. 100 కార్లు, 20 బస్సులు నిర్మల్‌కు బయల్దేరాయని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్, మావల మండలాల్లోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్, మావల మండల నాయకులు రాజేశ్వర్, ఏవన్, మహేందర్ యాదవ్, ఆదిలాబాద్ రూరల్ మండల నాయకులు రమణ, సెవ్వా జగదీష్, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్ ఉన్నారు.

'బీజేపీ నాయకుల వ్యాఖ్యలు సరికాదు'

బజార్‌హత్నూర్: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌పై బీజేపీ నాయకుల వ్యాఖ్యలు సరికాదని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గంగాపూర్ సమీపంలో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తే ఎన్నికల ప్రచారం కోసమే కొబ్బరికాయ కొడుతున్నారని చేస్తున్న బీజేపీ నాయకులు వ్యాఖ్యలను ఖండించారు. గంగాపూర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనాయక్‌తండాకు చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో తన గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించుకోలేదని ఎద్దేవా చేశారు. ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్ గత నాలుగేళ్లలో 4 సార్లు కూడా గంగాపూర్‌లో అడుగుపెట్టలేదన్నారు. నాయకులు సాయన్న, చంద్రశేఖర్, సాయిచైతన్య, లక్ష్మణ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువైంది

- ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి



పతాకం ఆవిష్కరిస్తున్న నళినీరెడ్డి

ఎదులాపురం: దేశంలో మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ 70వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో స్త్రీలకు రక్షణ కరువైందని, అందుకు ఇటీవల భారత రెజ్లర్లపై జరిగిన లైంగిక దాడులే నిదర్శనమన్నారు. అందుకు కారణమైన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి, తార, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

- 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉట్నూర్ జెడ్పీ పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మండలకేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వివాహాల అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వీరంతా మూడేళ్లుగా అందరినీ కలుస్తూ వాట్సాప్ వేదికగా ఏర్పాటు చేసుకున్నారు. వారంతా ఆదివారం ఉట్నూర్ కేంద్రంగా 27 వ సంతాల వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అప్పటి హెచ్‌ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు నారాయణ్, చంద్రయ్య, మహేశ్, భాస్కర్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను పూర్వవిద్యార్థులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇన్నేళ్ల తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులను ఒక వేదికపై తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనందోత్సాహాల మధ్య రోజంతా గడిపారు. బ్యాచ్‌లో మృతి చెందిన ఆరుగురు బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రత పూజలు



తాంసిలో మర్రిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు



తలమడుగులో మర్రి చెట్టుకు మహిళల పూజలు

తాంసి/తలమడుగు: తాంసి, భీంపూర్, తలమడుగు మండలవ్యాప్తంగా వటసావిత్రి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం పౌర్ణమి పురస్కరించుకుని మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు. మర్రిచెట్ల వద్ద మంగళహారతులతో పూజలు నిర్వహించారు. చెట్టుకు దారం చుట్టి నూతన వస్త్రాలు పెట్టి పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సభ్యులు అందరు సుఖసంతోషాలతో ఉండటంతోపాటు, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. అనంతరం ఒకరికొకరు పసుపు, కుంకుమ, ప్రసాదాలు, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. తాంసిలో వేద పండితుడు జూకంటి సతీశ్ వటసావిత్రి కథను మహిళలకు చదివి వినిపించారు.

సంక్షిప్త వార్తలు

6న కుమురం భీం జిల్లాకు మందకృష్ణ

ఇచ్చోడ: కుమురం భీం జిల్లాలో ఈనెల 6న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరవుతారని జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. మహాజన్ సోషల్ పార్టీ నాయకుడు దుబాక సుభాష్, జిల్లా నాయకుడు సిరిసిల్ల భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిట్టి రవి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. అధికారుల నిర్వహణ లోపం, పర్యవేక్షణ కరువుతో నెల రోజుల్లో నాలుగైదు ఆవులు, మేకలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయని స్థానికులు తెలిపారు. యార్డులో విద్యుత్ స్తంభాలకు షార్ట్ సర్క్యూట్ రావడంతో మూగజీవాలు మృతి చెందినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిక

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని మోమిన్‌పుర కాలనీకి చెందిన పలువురు యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ వారికి పార్టీ కండువా కప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

ఎదులాపురం: నేపథ్య సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన కొత్తూరు లింగయ్య అయన ఫ్లెక్సీ చిత్రానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్స్ రాజవర్ధన్, అశోక్, చిత్ర కళాకారులు కవిత, రచయితలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎదులాపురం: పట్టణంలోని వార్డు నంబర్ 48 ద్వారకానగర్ హనుమాన్ గల్లీలో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్ ఆదివారం ప్రారంభించారు.

దర్బా గ్రామం సందర్శన

నేరడిగొండ: మండలంలోని దర్బా గ్రామాన్ని రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం సందర్శించారు. యువకులు, గ్రామపెద్దలు బలరాంను సన్మానించారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక

బోథ్: సొనాలలోని మండల పరిషత్ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు గురుకులకు ఎంపికయ్యారు. గంగోత్రి, అనుశ్రీ, రుద్రప్రియ, శ్రీవల్లి, అనూష, రిషిక, అర్జున్, నిఖిల్, అమంత్, నవదీప్‌లు ఎన్నికైనట్లు హెచ్‌ఎం రడాపు మధుసూదన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్: సొనాల గ్రామానికి చెందిన బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలుమల పంచాక్షరి తండ్రి ఆడెల్లు ఇటీవల మృతిచెందారు. బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్ ఆదివారం ఆయన్ను పరామర్శించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్ రావ్ పాటిల్, ప్రచార కార్యదర్శి రామాయి సదానందం ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

నేరడిగొండ: ఇంటర్‌లో 907 మార్కులు సాధించిన వడూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని గాదె ప్రణతిని అప్పీల్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ పార్వతి ఆదివారం సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన ఆమెను అభినందించారు. గాదె కిషన్, ఉప్పు పోశెట్టి, రాథోడ్ రవిందర్, వెంకటరమణ, రాములు, నవీన్, చంద్రశేఖర్ ఉన్నారు.

మండల కన్వీనర్, కోకన్వీనర్ల ఎన్నిక

బేల: మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కన్వీనర్, కో కన్వీనర్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా గోరే విశాల్, కో కన్వీనర్‌లుగా బర్పటి శ్రీనివాస్, రౌత్ రమేశ్ ఎన్నికయ్యారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



భీంపూర్ పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

బోథ్/తాంసి/నేరడిగొండ: నిర్మల్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో బోథ్, తాంసి, నేరడిగొండలో బీజేపీ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. బోథ్‌లో మండల కార్యదర్శి శ్రీకాంత్, ముత్యం, బీజేవైఎం నాయకులు సోలంకి సాయి ఉన్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, భీంపూర్ మండల అధ్యక్షుడు రాకేశ్, నాయకులు అశోక్, రెడ్డి రమేశ్‌లను అదుపులో తీసుకున్నారు. నేరడిగొండలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్, బీజేపీ జిల్లా గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, బీసీ మోర్చ మండల కార్యదర్శి బొంతుకుల శ్రీను, చొక్కపెల్లి రాములు, గంధం నవీన్, తీగల నవీన్, కొప్పుల గంగారెడ్డి ఉన్నారు.

'హామీలు విస్మరించి పర్యటనకు రావడం హాస్యాస్పదం'

ఆదిలాబాద్: ఎన్నికల హామీలు నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా పర్యటనకు రావడం హాస్యాస్పదమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లాకు సీఎం పర్యటన నేపథ్యంలో ఆదివారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి గురించి ప్రశ్నించడానికి బీజేపీ నాయకులు సిద్ధపడితే అక్రమ అరెస్టులు చేయడం విచారకరమన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి గండ్రత్ మహేందర్, సూర్యకిరణ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే బహిరగ సభను విజయవంతం చేయాలని రమాయి మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు తులజాపూరే శోభాబాయి కోరారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఆమె మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల హక్కుల సాధన కోసం, రాజ్యాంగాన్ని రక్షించడానికి బహుజనులు ఏకతాటిపై తేవడానికి ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ హాజరవుతారన్నారు. అనంతరం అంబేద్కర్ మెమోరియాల్ అసోసియేషన్ నాయకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోన్ కాంబ్లే మనోహర్, పవార్ శివాజీ, వాగ్మరే కాంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎదగాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లాలో ఉన్న ప్రతిభ గల క్రికెటర్లంతా జాతీయస్థాయికి ఎదగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. స్థానిక డైట్ కళాశాల మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఆదిలాబాద్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతగా నిలిచిన జేసీ లాన్సర్స్ జట్టుకు ట్రోఫీని బహూకరించారు. అనంతరం మాట్లాడారు. ఐపీఎల్ తరహాలో నిర్వహిస్తున్న ఇలాంటి టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భో జారెడ్డి, నాయకులు యూనుస్ అక్బానీ, నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలో వస్తే రైతు రుణమాఫీ

బేల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ అందిస్తోందని పార్టీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి సి. రాంచంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. మండలంలోని సదల్‌పూర్‌లో గడప గడపకూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ బృందం తిరుగుతూ వరంగల్ రైతు డిక్లరేషన్‌ను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.500లకే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఎకరాకు రూ.15వేలు రైతు బంధు పెట్టుబడి, నిరుపేదలకు సొంత స్థలాల్లో డబుల్ బెడ్రూం మంజూరు చేస్తామన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్ శివారు ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలం ఈదుళ్ల సావర్గాం గ్రామానికి చెందిన మల్లెల మహేందర్, జగదీశ్ బైక్‌పై ఆదిలాబాద్‌కు వచ్చారు. సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేందర్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.